

స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు నేడే !

సంగారెడ్డి అర్బన్, జూన్ 22 : ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో జడ్పీ యాజమాన్య పరిధిలోని (మల్టీజోన్-2) స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు నేడు విడుదలయ్యే అవకాశముంది. వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో పదోన్నతి ఉత్తర్వులు నేడో, రేపో విడుదలయ్యే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. జడ్పీ యాజమాన్య పరిధిలోని ఎస్జీటీల బదిలీల ప్రక్రియ కూడా రెండు, మూడు రోజుల్లో పూర్తికావచ్చని అధికారులు తెలిపారు.

మెదక్ సీఐల బదిలీ

ఐజీ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు

మెదక్ అర్బన్, జూన్ 22: మెదక్ పట్టణ సీఐ దిలీప్‌కుమార్, రూరల్ సీఐ కేశవులను బదిలీ చేస్తూ..మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు సీఐలను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజామాబాద్ పీఆర్సీలో పని చేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని మెదక్ రూరల్ సీఐగా నియమించారు. ఈ నెల 15న మెదక్ పట్టణంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ, దాడుల నేపథ్యంలో ఇద్దరు సీఐలపై బదిలీ వేటు వేయడం చర్చనీయాంశమైంది.


8 మంది పోలీసులకు ఉత్తమ పతకాలు

సంగారెడ్డి క్రైం, జూన్ 22 : పోలీసుశాఖలో ఉత్తమ సేవ లందించిన సంగారెడ్డి జిల్లాకు చెందిన 8 మంది పోలీసు సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. ఇద్దరు పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు, ఆరుగురికి సేవా పతకాలు లభించాయి. సంగారెడ్డిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఆర్ఎస్ఐగా ఉన్న సయ్యద్ ఖదీరుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐగా పనిచేస్తున్న టి.సంజీవరెడ్డికి ఉత్తమ సేవా పతకాలు లభించాయి. సంగారెడ్డి ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఏఆర్ ఎస్ఐలుగా పనిచేస్తున్న వై.నాగార్జునరెడ్డి, ఎస్‌కె సలామ్, స్పెషల్‌బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ టి.లక్ష్మారెడ్డి, కల్హేర్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కె.ప్రేమ్‌కుమార్, సంగారెడ్డి స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.గోపాల్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్‌ముక్తార్ సేవా పతకాలు దక్కించుకున్నారు. ఆగస్టు 15న వీరు పతకాలను అందుకోనున్నారు. పతకాలు దక్కించుకున్న పోలీసులను ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 22 : జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అబ్కారీ శాఖ అధికారులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్, గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యా సంస్థలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేయించాలని ఆదేశించారు. పాఠశాలలకు సమీపంలో ఉన్న కిరాణా, పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల బాధితులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి నవీన్‌చంద్ర, డీఎంహెచ్‌వో గాయత్రి, మహిళా సంక్షేమాధికారి వసంతకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతుకు భరోసా

రూ. 2 లక్షల లోపు రైతు రుణాలను ఏక కాలంలో మాఫీ చేస్తామని సర్కారు ప్రకటన

- రుణ మాఫీతో సంగారెడ్డి జిల్లాలో 1,79,322 మందికి ప్రయోజనం
- రూ.2505.22 కోట్లు మాఫీ
- మెదక్ జిల్లాలో 1.60 లక్షల మందికి రూ. వెయ్యి కోట్ల రుణమాఫీ
- త్వరలో మార్గదర్శకాల విడుదల

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి/మెదక్, జూన్ 22: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మేరకు రైతు రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్య రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయంతో సంగారెడ్డి జిల్లాలో 1,79,322 మంది రైతులకు ప్రయోజనం కలగనున్నది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 మధ్య తీసుకున్న రూ. 2లక్షల లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పూర్తిస్థాయి విధివిధానాలను ఇంకా రూపొందించాల్సి ఉన్నది. ఫామ్‌హౌస్‌లు, బడా రైతులు, ఆదాయపువన్ను చెల్లించేవారికి రుణమాఫీ అమలు చేయరాదని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం పేర్కొన్న ప్రాథమిక షరతుల ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 1,79,322 మంది రైతులకు రుణమాఫీ ద్వారా మేలు చేకూరనున్నది. ఇందుకోసం రూ.2505.22 కోట్లు అవసరమవుతాయని లీడ్ బ్యాంక్ అంచనా వేసింది. లబ్ధిపొందేవారిలో సుమారు లక్ష మంది రెండు లక్షల రూపాయల చొప్పున రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. మిగతా రైతులు లక్ష నుంచి రెండు లక్షల రూపాయల లోపు రుణాలు తీసుకున్నవారు ఉన్నట్టు తెలిసింది. వీరందరికీ రుణమాఫీతో ఊరట లభించనుంది.

మెదక్ జిల్లాలో 1.60 లక్షల మందికి..

మెదక్ జిల్లాలో 1,60,000 మంది రైతులకు సుమారు వెయ్యి కోట్లు రుణ మాఫీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు సూచన ప్రాయంగా తెలిపారు. 2018 డిసెంబర్ 12 నుంచి డిసెంబర్ 9వ తేదీ 2023 వరకూ రూ.2 లక్షల రుణాలు పొందిన రైతుల వివరాలను జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు సేకరిస్తున్నారు. మెదక్ జిల్లాలో 2014 నుంచి 2018 వరకు రుణాలు తీసుకున్న 1,50,514 మంది రైతులకు రూ.912 కోట్లు మాఫీ చేయాలని సంకల్పించినా పూర్తిగా సాధ్యం కాలేదని వివరాలు తెలుపుతున్నాయి. ఇందులో 73,026 మంది రైతులకు రూ.366.39 కోట్లు చెల్లించారు. మిగతా 77,488 మంది రైతులకు రూ. 546 కోట్లు రుణ మాఫీ చేయాల్సి ఉండగా పలు కారణాల వల్ల సాధ్య పడలేదు. అప్పుడు రుణాలు మాఫీ కాని వారి పరిస్థితిపై ఇంకా స్పష్టత లేదు. జూలై 1వ తేదీ నాటికి రుణ మాఫీపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

పది రోజులే..

- ముగియనున్న స్థానికసంస్థల పదవీకాలం
- మాజీలు కానున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీలు
- 2019 జూన్‌లో కొలువుదీరిన పాలకవర్గాలు
- వచ్చే నెలతో ఐదేళ్లు పూర్తి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జూన్ 22 : స్థానికసంస్థల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాజీలు కానున్నారు. జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియనుండడంతో అధ్యక్ష, ఉపాధ్యక్షులు పదవులను కోల్పోనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 25 జడ్పీటీసీ స్థానాలకు, 295 ఎంపీటీసీ స్థానాలకు 2019 మే 6, 10, 14 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న ఫలితాలు వెల్లడయ్యాయి. 2019 జూలై 5న ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఐదేళ్ల పాటు అంటే వచ్చే నెల 4వ తేదీ వరకు వీరి పదవీకాలం ఉంటుంది. అదే రోజు సభ్యులతో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.ప్రభాకర్‌తో పాటు మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఖాళీ కానున్నాయి.

బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి తేరుకోని బీఆర్ఎస్‌కు స్థానిక సంస్థల పాలన ముగియడంతో మరో ఎదురుదెబ్బ తగలనుంది. జిల్లాస్థాయిలో పెద్ద దిక్కుగా ఉన్న జడ్పీ ఛైర్‌పర్సన్, ఉపాధ్యక్షుల పదవులు కోల్పోవడంతో పాలనలో ఆ పార్టీ భాగస్వామ్యం లేకుండా పోతుంది. అధికారం కోల్పోయినా స్థానికసంస్థల ప్రతినిధులు ఉండడంతో తమ గొంతు వినిపించే అవకాశం ఉండేది. అంతేకాకుండా నాయకులకు, కార్యకర్తలకు బలంగా నిలిచేవారు. స్థానిక ప్రజాప్రతినిధులు పదవులు కోల్పోవడం ఆ పార్టీకి మరింత ఇబ్బందికరమేనని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రత్యేకాధికారుల నియామకం

జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్లను నియమించనున్నారు. జిల్లా ప్రజా పరిషత్‌కు కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. మండల ప్రజా పరిషత్‌లకు మండల స్పెషల్ ఆఫీసర్లే ఇన్‌చార్జిలుగా నియమితులు కానున్నారు. వీరి ఆధ్వర్యంలోనే జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్‌ల ద్వారా నిర్వహించే అభివృద్ధి పనులు జరగనున్నాయి.

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయానికి సోలార్ వెలుగులు

- ఆఫీసు పైభాగంలో సౌరఫలకలు
- 135 యూనిట్ల కరెంటు ఉత్పత్తి



మున్సిపల్ ఆఫీసు పైభాగంలో ఏర్పాటు చేస్తున్న సౌరఫలకలు

తూప్రాన్, జూన్ 22: మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయానికి సోలార్ వెలుగు అందించే కార్యక్రమం రాష్ట్రంలో మొదటిసారిగా కొనసాగుతుంది. విద్యుత్ వినియోగ భారం తగ్గించుకోడానికి 15వ ఫైనాన్స్ నిధులు ఖర్చుచేసి సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి ప్రతినెలా 2 వేలకుపైగా విద్యుత్ యూనిట్లు వినియోగిస్తుండగా, సుమారు రూ.25వేలకుపైగా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తుంది. అలాగే స్ట్రీట్ లైట్లు, డివైడర్ లైట్లకు సుమారు 10వేల విద్యుత్ యూనిట్లను వినియోగిస్తున్నారు. ఆదాయంలో ఎక్కువభాగం విద్యుత్ వినియోగానికే ఖర్చవుతున్నది. ఈ నేపథ్యంలో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయానికి సోలార్ విద్యుత్ అందించేందుకు రాష్ట్ర రెనవెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఆర్ఈడీసీవో) సంప్రదించింది. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ కలెక్టర్‌ను సంప్రదించడంతో కలెక్టర్ నుంచి అనుమతి లభించింది. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేందుకు 15వ ఫైనాన్స్ నిధులకు అనుమతి వచ్చింది. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయానికి 26 కిలోవాట్స్ సర్వీస్ లోడ్ వినియోగిస్తుండగా, దానిని ప్రస్తుతం 38 కిలోవాట్స్ సర్వీస్ లోడ్‌కు పెంచారు. ప్రతిరోజు సోలార్ విద్యుత్ 135 యూనిట్లు ఉత్పత్తి కానుండగా, కార్యాలయం, స్ట్రీట్ లైట్లకు వినియోగించనున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ భారం భారీగా తగ్గిపోనుంది. ఇందుకు 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.20.68 లక్షలు ఖర్చు చేస్తున్నారు. సోలార్ విద్యుత్‌కు సంస్థ ఐదేళ్ల పాటు సర్వీస్ చేయనుండగా, 27 ఏళ్ల పాటు పనిచేస్తాయని వివరిస్తున్నారు. వినియోగం చేయగా మిగిలిన సోలార్ విద్యుత్‌ను విద్యుత్ సంస్థ తీసుకొని యూనిట్‌కు రూ.4.90లు చెల్లించనున్నది. రాష్ట్రంలోని వివిధ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ మున్సిపల్ కార్యాలయంపై సోలార్ ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే మొదటిసారని అధికారులు చెబుతున్నారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంపై సోలార్ పలకల బిగింపు కొనసాగుతుండగా, కొద్దిరోజుల్లోనే సోలార్ విద్యుత్ ఏర్పాటుకానున్నది.



మెదక్ బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన బాట

- అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్
- రెండో రోజూ నిలిచిపోయినన బస్సులు

మెదక్ అర్బన్, జూన్ 22: అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. డిపో మేనేజర్, సీఐ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం విధులు బహిష్కరించిన ఆర్టీసీ డ్రైవర్లు రెండోరోజూ ఆందోళనకు దిగడంతో బస్సులు డిపో నుంచి బయటకు రాలేదు. ఆర్టీసీలోని అద్దె బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. ఈ సందర్భంగా మొదటి రోజు జరిగిన చర్చలు విఫలం కాగా, శనివారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గంగాధర్ సమక్షంలో డీఎం, డ్రైవర్లకు దాదాపు మూడు గంటల పాటు చర్చలు జరిగాయి. గతంలో మాదిరిగా ఒక్కో డ్రైవర్ బస్సును రెండు రోజుల్లో 540 కిలో మీటర్ల నడపుతామన్నారు. లేదా మిగితా డిపోల మాదిరిగా రెండు రోజులు 720 కిలోమీటర్ల దూరం బస్సు నడిపితే 3వ రోజు స్పెషల్ ఆఫ్ ఇవ్వాలన్నారు. డ్రైవర్ల ప్రతిపాదనలకు డీఎం ససేమిరా అన్నారు. ఆర్టీసీ నిబంధనల ప్రకారం బస్సులను నడపాలన్నారు. దీంతో, సాయంత్రం మరోమారు చర్చలు జరిగినా విఫలమయ్యాయి. ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతానని డిప్యూటీ ఆర్ఎం దైవదీనం చెప్పారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

గజ్వేల్ కాంగ్రెస్‌లో గడబిడ.. గ్రూపులు విడిపోయిన నాయకులు

గజ్వేల్, జూన్ 22: గజ్వేల్ నియోజకవర్గంలో నామినెటెడ్ పదవులు చిచ్చురేపాయి. అంతా కలసిమెలసి ఉన్న నాయకులు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు గ్రూపులుగా విడివడి పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. 'నిన్న.. మొన్నటి వరకు నర్సారెడ్డి అంటే మేము... మేము అంటే నర్సారెడ్డి' అన్నట్లుగా ఉన్న నాయకులు సైతం పదవి దక్కదని తెలిసి అసమ్మతి రాగాన్ని అందుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు చెంతకు చేరారు. అసమ్మతి నాయకులంతా జత కలవడంతో పార్టీలో అసమ్మతి ఏకతాటిపైకి వచ్చినట్లు అయింది. వీరంతా కలసి ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి నర్సారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అసమ్మతి నాయకులకు నర్సారెడ్డి దీటుగా స్పందిస్తున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌లను కలసి నామినేటెడ్ పదవులకు సంబంధించిన వివరాలను అందజేశారు. గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

డయాలసిస్ పడకల పెంపు

- సంగారెడ్డి, జహీరాబాద్ ఆస్పత్రుల్లో ఐదు చొప్పున అదనపు పడకలు
- కిడ్నీ బాధితులకు మరింత ఊరట

సంగారెడ్డి అర్బన్, జూన్ 22 : సంగారెడ్డి జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో కొనసాగుతున్న డయాలసిస్ కేంద్రాల్లో పడకల స్థాయి పెంపుపై ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. జిల్లాలోని పలు డయాలసిస్ కేంద్రాల్లో పడకల సంఖ్య సరిపోక రాత్రి వేళల్లో డయాలసిస్ చేసుకునే పరిస్థితి రావడంతో ఇటీవల ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు పడకల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఈమేరకు రెండ్రోజుల క్రితం అనుమతి వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో ప్రస్తుతం తొమ్మిది పడకలతో డయాలసిస్ కేంద్రం కొనసాగుతుండగా, మరో ఐదు పడకల పెంపునకు అనుమతి వచ్చింది. జహీరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ప్రస్తుతం ఐదు పడకలు ఉండగా, అదనంగా ఐదు పడకలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆయా ఆస్పత్రుల అధికారులు స్థల పరిశీలన చేస్తున్నారు. పడకల సంఖ్య పెంపుతో మరింతమంది బాధితులకు డయాలసిస్ సేవలు లభిస్తాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ తెలిపారు.



సంగారెడ్డిలోని డయాలసిస్ సెంటర్



మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజు


మిషన్ భగీరథ ఇంటింటా సర్వే 97 శాతం పూర్తి

మెదక్ అర్బన్, జూన్ 22: జిల్లాలోని మిషన్ భగరథ నల్లా కనెక్షన్లపై నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే రెండు రోజుల్లో పూర్తిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయం నుంచి శనివారం ఆయన అధికారులతో గూగుల్‌మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికి తాగునీరు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం సర్వేను ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 97 శాతం పూర్తయిందన్నారు. రెండ్రోజుల్లో వంద శాతం పూర్తిచేయాలని సూచించారు.

జనం మధ్యలో చేరి చోరీలు

- ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

హుస్నాబాద్, జూన్ 22 : రాజకీయ సమావేశాలు, సభలు, ర్యాలీలు జరుగుతున్నాయంటే చాలు ఆ ముఠా కార్యకర్తల్లా కలిసిపోయి వారి జేబులను ఖాళీ చేస్తుంది. రెండు రోజుల క్రితం హుస్నాబాద్‌లో జరిగిన ర్యాలీలో పిక్ ప్యాకెటింగ్‌కు పాల్పడిన ముఠాను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎస్ఐ తోట మహేశ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన ఇట్ల అంజనేయులు, దేవరకొండ దుర్గారావు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీరామ్ గోపి, భూపాల్లిలోని సుభాష్ కాలనీకి చెందిన రేవెల్లి రమేశ్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కంప నానిలు ముఠాగా ఏర్పడ్డారు. వీరు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగినా అక్కడికి వచ్చి పిక్ ప్యాకెటింగ్ చేస్తారు. రెండు రోజుల క్రితం హుస్నాబాద్‌లో పలువురి జేబులు ఖాళీ చేశారు. నిందితులను హుస్నాబాద్‌లో అరెస్ట్ చేసి, వారి నుంచి కారు, అయిదు మొబైల్ ఫోన్లు, రూ. 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించారు. పాత నేరస్థులైన వీరు జైలులో ఏర్పడిన పరిచయాలతో ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.









రోడ్డు ప్రమాదంలో తుపాకులపల్లి వాసి మృతి

● ఇమాంపూర్ చౌరస్తా వద్ద ఘటన



ముత్యాలు(ఫైల్)

తూప్రాన్, జూన్ 22: నిత్యావసర సరుకులు తెచ్చేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి వచ్చిన కారు, కంటైనర్ లారీలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామపంచాయతీ పరిధి తుపాకులపల్లి గ్రామానికి చెందిన ఏశం ముత్యాలు(50) నిత్యావసర వస్తువులు తెచ్చుకోడానికి టీవీఎస్ ఎక్సెల్‌పై తూప్రాన్ పట్టణానికి బయలుదేరాడు. తూప్రాన్ మండలం ఇమాంపూర్ చౌరస్తా సమీపంలో ముందుగా వెళ్తున్న ముత్యాలును వెనక నుంచి వస్తున్న కంటైనర్ లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముత్యాలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కూతురు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి వివరించారు.

రోడ్డేశారు.. స్తంభం మరిచారు..


మర్రిముచ్చాల గ్రామంలో రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంభం

చేర్యాల, జూన్ 22: ఇలాంటి ఫొటోలు సోషల్‌మీడియాలో కనిపిస్తే.. నిజంగా ఇలా కూడా జరుగుతుందా? అని ఆశ్చర్యపోతుంటాం. కానీ, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో అధికారులు దానిని నిజం చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. సిద్దిపేట- జనగామ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో సర్వీస్ రోడ్డు వేస్తున్నారు. ఈ సర్వీస్ రోడ్డు కోసం గ్రామానికి ఆనవాలుగా నిలిచిన భారీ మర్రిచెట్టును నరికివేశారు. తర్వాత బీటీ రోడ్డు పనులు ప్రారంభించగా.. పాత రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ఇలా రోడ్డు మధ్యలోకి వచ్చేసింది. అయినా.. రోడ్డు వేస్తూ వెళ్లిపోయారు. కనీసం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గానీ, అధికారులు కానీ స్తంభం రోడ్డు మధ్యలోకి వచ్చిందన్న విషయాన్ని గమనించారో లేదు. లేక.. అది తమ పని కాదు.. రోడ్డు వేయడమే ముఖ్యం అనుకున్నారో ఏమో.. ఈ రోడ్డుపై చీకటి వేళ స్తంభం కనిపించకుండా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదో మరి..



హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్



దేవ్‌రాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌వైసీ.క్రికెట్.ఇన్) వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కానీ వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.









జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక




పాఠశాల గదులు శుభ్రం చేసే డెస్ట్ లిఫ్ట్ ప్రాజెక్టుతో విద్యార్థి స్రవంతి, వీధిదీపాలను అమర్చే నమూనా ప్రాజెక్టుతో విద్యార్థి మహ్మద్ ముస్తఫా అహ్మద్

సంగారెడ్డి అర్బన్, జూన్ 22: జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు (ఇన్‌స్పైర్ మనక్) సంగారెడ్డి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి స్రవంతి పాఠశాల గదులు శుభ్రం చేసే డెస్ట్ లిఫ్ట్, అదే విధంగా కోహీర్ మండలం కావేలి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి మహ్మద్ ముస్తఫా అహ్మద్ వీధిదీపాలను సులభంగా అమర్చే నమూనాలను రూపొందించారు. ఆయా ప్రాజెక్టులు జిల్లా, రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికకావడం పట్ల వారిని డీఈవో వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఆయా మండలాలు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు అభినందించారు.

వర్షాకాలం.. జరభద్రం

● విద్యుత్‌పై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు ● జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



దౌల్తాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ మర్మతులు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, జూన్ 22: దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ యువ రైతు ఇటీవల తన పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వర్షాకాలంలో చాలామంది రైతులు తరచూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో విద్యుత్‌తో బోరుబావులు, వాగులు, పొలాల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి పంట సాగు చేస్తుంటారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలకే ప్రమాదం, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.



విద్యుదాఘాతంతో గాయాలైన బాధితుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

పరిహారం అందాలంటే..

విద్యుత్ సంస్థ కేవలం మూడు ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అంటే పశువులు, మనుషులు మృతిచెందితే పరిహారం అందిస్తున్నది. గాయాలకు పరిహారం ఉండదని వెల్లడిస్తున్నారు. మనుషులు మృతిచెందితే రూ.5 లక్షలు, ఆవులు, గేదెలు మృతిచెందితే రూ.45 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన స్థలంలోని వాటి చిత్రంతో పాటు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాల్సిన ఉంటుంది. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం రిపోర్టును జతచేసి సమర్పించాలి.

అవగాహన కల్పించాలి



విద్యుత్ వినియోగంపై అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు అర్థమయ్యే విధంగా విద్యుత్ వినియోగంపై వివరిస్తే ఉపయోగం ఉంటుంది.

- రైతు, నర్ర రాజేందర్, దొమ్మాట

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లైన్‌మన్లను అందుబాటులో ఉంచుతూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. లూప్‌లైన్లు వేలాడుతున్నా.. కిందపడిపోయినా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- వాసుదేవరావు, విద్యుత్ ఏఈ, దౌల్తాబాద్

ఇలా జరిగితేనే నష్టపరిహారం

- అకస్మాత్తుగా తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మరణిస్తే
- తక్కువ ఎత్తులోని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా మృతిచెందితే
- తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు తగిలి ప్రాణాలు పోతే

జాగ్రత్తలు

- మోటార్లను ప్రత్యేకంగా గద్దెలపై ఏర్పాటు చేసుకోవాలి
- స్టార్టర్ బోర్డు తడవకుండా చూసుకోవాలి
- మోటార్ పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతు చేయించుకోవాలి
- సర్వీస్ వైర్లు, మోటార్‌కు నాణ్యమైన తీగలే వాడాలి
- వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేసుకోవాలి
- సబ్ మెర్సిబుల్ మోటార్లలో విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ వైరు తెగినా మోటార్ నుంచి పైన ఉండే వస్తువుల వరకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.

మా భూములు తీసుకుంటే ఎలా బతకాలి..?

● సంగారెడ్డి కాలువకు భూములివ్వంటూ జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

● ఆర్డీవో హామీతో రాస్తారోకో విరమణ



నర్సాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులకు నచ్చచెబుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 22: తరతరాలుగా ఆ భూములను నమ్ముకుని మా కుటుంబాలు బతుకుతున్నాయి. అలాంటి భూములను ఇప్పుడు కొండపోచమ్మ నుంచి తీయనున్న సంగారెడ్డి కాలువ కోసం తీసుకుంటామంటే మేం ఎలా బతకాలంటూ మెదక్ జిల్లా చిన్నచింతకుంట గ్రామ రైతులు శనివారం జాతీయ రహదారిపై రాస్తారో చేశారు. కొండసంగారెడ్డి కెనాల్ కోసం రైతుల నుంచి భూసేకరణకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో మూడురోజులుగా గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మండలంలోని చిన్నచింతకుంట గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు సంగారెడ్డి కెనాల్ త్వరలో చేపట్టనున్న రీజినల్ రింగురోడ్డు లోపల ఏర్పాటు కానున్నదని, దీంతో ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా అభివృద్ధి చెందే అవకాశం ఉండడంతో తమ గ్రామాల గుండా కాలువ వద్దంటూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో స్పందిస్తూ తన చేతిలో నిర్ణయం తీసుకునే అవకాశం లేదని, కేవలం మీ అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినతి పత్రం ఇచ్చి బయటకు వచ్చిన చిన్నచింతకుంట రైతులు మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ కుటుంబాల ఈ భూములపైనే ఆధారపడి బతుకుతున్నాయని, మా భూములు తీసుకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పరిహారం విషయమై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా భూములు తీసుకోవడానికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రూ.50 లక్షలకు పైగా ఎకరా పలుకుతున్న భూములకు అరకొర పరిహారం ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. కాలువలకు బదులు పైపుల ద్వారా నీటిని తరలించాలన్నారు. మీ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ నిరసనలో చిన్నచింతకుంట రైతులు నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని బతుకమ్మకుంట కట్టను తొలగించి పైపులను వేస్తున్న అధికారులు

కుంట కట్టను తవ్వి చెరువులోకి మురుగునీరు

● మంత్రి చెప్పారంటూ మున్సిపల్ అధికారుల నిర్వాకం

● పనులను అడ్డుకున్న కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్, జూన్ 22: చెరువులో కలుషితమవుతున్న నీటిని శుద్ధి చేయాల్సిన అధికారులే చెరువులోకి మురుగునీటిని తరలించేలా చర్యలు చేపట్టారు. పైగా మంత్రి చెప్పారంటే అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం శోచనీయం. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి హౌసింగ్ కాలనీలో బతుకమ్మకుంట కట్టను అధికారులు దగ్గరుండి తవ్వేస్తుండగా శనివారం కాలనీవాసులు అడ్డుకున్నారు. బతుకమ్మకుంట కట్టను తవ్వేసి ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి మురుగునీటిని తరలించేలా పైపులను వేశారు. ప్రైవేట్ పాఠశాలకు లబ్ధిచేకూరేలా చేస్తున్న పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. అయితే మంత్రి చెప్పారంటే మున్సిపల్ అధికారులు దగ్గరుండి కట్టను తవ్వేసి పైపులైన్ వేయడం కాలనీవాసులకు ఆగ్రహం తెప్పించింది. తామంతా మంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని అధికారులకు చెప్పారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం లేకుండా బతుకమ్మ కుంట కట్టను మున్సిపల్ అధికారులు తవ్వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డీసీసీబీ పరిధిలో 57,585 మంది రైతులకు విముక్తి

● రూ.451కోట్ల రుణ మాఫీ

● డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిదేవేందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 22: ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ పరిధిలోని 57,585 మంది రైతులకు రూ.451 కోట్ల రుణమాఫీ కానున్నదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల వరకు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామమన్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ పరిధిలోని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన 57,585 మంది రైతులకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్యలో రుణాలు తీసుకున్న రైతులకు రుణాలు మాఫీ కానున్నాయని వివరించారు. మాఫీ అయిన రైతులందరికీ డీసీసీబీ ద్వారా తిరిగి రూ.450 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు ఎకరాల భూమి కలిగిన రైతుల ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇవ్వనున్నామన్నారు. మండల కేంద్రాల్లో రూ.40 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డీసీసీబీ ద్వారా మహిళా సంఘాలు, వాహనాలు, వ్యాపారాలకు కూడా పెద్దఎత్తున రుణాలు ఇస్తున్నామని దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రమేష్, వెంకట్రాములు, చంద్రయ్యస్వామి, పద్మదుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

మెదక్ అర్బన్, జూన్ 22: మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్రీడాకారుడు బెనర్జీ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 11 నుంచి 13 ఏళ్లలోపు బాలబాలికలకు, 14 నుంచి 16 ఏళ్ల బాలబాలికలతోపాటు 40 ఏళ్లపైబడిన పురుషులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన జట్లకు డీవైఎస్‌వో నాగరాజ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అసోసియే

కాలనీలోకి వరద నీరు వెళ్లకుండా చర్యలు

నర్సాపూర్, జూన్ 22: నర్సాపూర్ పట్టణం 9వ వార్డులోని విజ్ఞేశ్వర కాలనీవాసులు వరదనీటితో పడే ఇబ్బందులపై 'ఆ కాలనీకి శాపం' అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వరదనీరు కాలనీలోకి వెళ్లకుండా ప్రస్తుతానికి ప్రత్యేకంగా కాలువ తీసి బయటకు వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వార్డుసభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు రవిబాబు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న దృశ్యం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శిథిలమవుతున్న రికార్డులు

● పట్టించుకోని ప్రధానోపాధ్యాయులు

● ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్ రిజిస్టర్లకు భద్రం

● జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారిస్తే విద్యార్థులకు మరింత సమాచారం



మద్దూరులో బీరువాలో శిథిలమైపోతున్న రికార్డులు

మద్దూరు, జూన్ 22: సిద్దిపేట జిల్లాలో సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి ఉన్న పాఠశాలల్లోని అడ్మిషన్ రిజిస్టర్లు, రికార్డులు శిథిలమైపోతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ పేరుతో విద్యార్థుల లెక్క పక్కా నమోదుతో పాటు పాఠశాల సమగ్ర వివరాలను సేకరిస్తోంది. పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల, సౌకర్యాల పూర్తి సమాచారంతో అన్ని రాష్ట్రాల విద్యార్థుల వివరాలు ఒకే పోర్టల్‌లో ఉండాలని ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టింది. మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, ఉపకార వేతనాలు, రవాణా భత్యం తదితర పథకాలకు యూడైస్‌లోని వివరాల ఆధారంగా బడ్జెట్ కేటాయించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శిథిలమవుతున్న అడ్మిషన్ రిజిస్టర్లకు ప్రత్యేక యాప్ క్రియేట్ చేసి భద్రపరిస్తేనే భవిష్యత్తులో విద్యార్థులకు కావాల్సిన సమాచారం అభ్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో సుమారు 1950లో పాత వరంగల్ జిల్లాలోని జనగామ తాలుకాలో మద్దూరులో పాఠశాల ఏర్పాటు అనంతరం దూళిమిట్టలో 1960లో, లద్నూరులో 1962లో మాత్రమే పాఠశాలలు ఏర్పాటయ్యాయి. తదనంతరం సలాఖ్‌పూర్, నర్సాయపల్లి, రేబర్తి, బైరాన్‌పల్లి, డీఎన్‌టీ కూటిగల్, కొండాపూర్‌తో పాటు మోడల్‌స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు హైస్కూళ్లుగా ఏర్పడ్డాయి. ఉమ్మడి మద్దూరు మండలంలో మద్దూరు క్లస్టర్‌లో హైస్కూల్స్ 3 యూపీఎస్‌లు 1, పీఎస్‌లు 5, రేబర్తి క్లస్టర్‌లో హైస్కూల్స్ 2, యూపీఎస్‌లు 2, పీఎస్‌లు 5, దూళిమిట్ట క్లస్టర్‌లో హైస్కూల్స్ 4, యూపీఎస్‌లు 2, పీఎస్‌లు 11 ఉన్నాయి. కాగా విద్యార్థులు లేకపోవడంతో సుమారు 15 ఏళ్ల క్రితం లక్కపల్లిలోని పీఎస్‌తో పాటు మద్దూరులోని ఎస్సీ కాలనీలోని పీఎస్ మూతపడ్డాయి.

పాడైన అడ్మిషన్ రిజిస్టర్లు

ఉమ్మడి మద్దూరు మండలంలో సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి ఉన్న అన్ని పాఠశాలల్లోని అడ్మిషన్(ప్రావేశిక, నిష్క్రమణ పుస్తకం) రిజిస్టర్లు దాదాపుగా శిథిలమైపోతున్నాయి. ఫర్నిచర్, బీరువాలు పాతవైపోయాయి. భద్రంగా దాచిన అడ్మిషన్ రిజిస్టర్లు, రికార్డులు ముట్టుకుంటేనే కాగితాలు విచ్చుకుపోతున్నాయి. పూర్వ విద్యార్థులకు ఏదేని సమాచారం అందివ్వాలంటే అడ్మిషన్ రిజిస్టర్లు ముట్టుకునే పరిస్థితులు లేకుండా ఉన్నాయి. రిజిస్టర్లు తెరిస్తే కమ్మలు(పేపర్లు) ముక్కలుగా విరిగిపోతున్నాయి. ఎంతో జాగ్రత్తగా భద్రపరిచినా సమాచారం తీసుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టిసారించి వీటి భద్రతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ మాదిరిగా ఆన్‌లైన్ ప్రక్రియకు చర్యలు తీసుకుంటే తప్ప.. మార్గం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



లక్కపల్లిలో పశువుల దొడ్డిగా మూతపడ్డ ప్రాథమిక పాఠశాల



మద్దూరులో శిథిలమైన అడ్మిషన్ రిజిస్టర్

సమాచారం ఇవ్వలేని పరిస్థితి

విద్యార్థులు సమాచారం కోసం వస్తే ఇవ్వలేని పరిస్థితి ఉన్నది. రికార్డు తెరిస్తే పేజీలు ఊడిపోతున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు పూర్వ విద్యార్థులకు సమాచారం అందించే అవకాశం ఉన్నది.

- శ్రీశైలం, యూపీఎస్ హెచ్‌ఎం, మద్దూరు

ప్రజాపాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చేగుంట, జూన్ 22: తిరిగి ప్రజా పాలన సేవా కేంద్రాలు పునః ప్రారంభించినట్లు మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో గల ప్రజా పాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన ప్రజాపాలన కేంద్రాలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజాపాలన కేంద్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో ఉన్న సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సేవా కేంద్రాల్లో గతంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులలో తప్పులు ఉన్నట్లయితే ఈ సేవా కేంద్రాల ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విధులకు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తుండ్రు

- సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్ ఎంపీటీసీ ఆగ్రహం



సమావేశంలో విద్యుత్ అధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ

రామాయంపేట, జూన్ 22: కరెంట్ కోతలు విధిస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు ట్రాన్స్‌కో ఏఈ పెంట్యానాయక్‌పై మండిపడ్డారు. శనివారం రామాయంపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ ప్రభుత్వం బదనాం అవుతుందంటూ అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా తరచూ ఎందుకు ట్రిప్ అవుతుందని ప్రశ్నించగా.. ఇకపై అలా జరగకుండా చూస్తామని ఏఈ పెంట్యానాయక్ సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీపీ భిక్షపతి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అధికారుల సహకారం అవసరమన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ స్రవంతి సిద్దిరాంరెడ్డి. ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై కంకర తేలి నరకయాతన



కంకర తేలి అధ్వానంగా మారిన పిచేర్యాగడి తండా రోడ్డు

- ఉమ్మడి రాష్ట్రంలో వేసిన రహదారి
- నేటికీ మరమ్మతులకు నోచుకోని వైనం
- రెండేళ్ల క్రితం రూ.1.42 కోట్ల నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పిచేర్యాగడి తండావాసులకు తప్పని ఇక్కట్లు

కోహీర్, జూన్ 22: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు వేసిన తారు రోడ్డు ప్రస్తుతం కంకర తేలి అధ్వానంగా మారడంతో తండాకు చెందిన దాదాపు వెయ్యి మంది గిరిపుత్రులు నిత్యం నరకయాతన పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి గ్రామ పంచాయతీ నుంచి పిచేర్యాగడి తండా వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా, మరమ్మతులు చేసేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గిల్లా రాళ్లను పేర్చిన మాదిరిగా తయారైంది. ఈ రోడ్డును బాగు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తండా గిరిజనులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

పంచాయతీగా మారినా..

గతంలో పిచేర్యాగడి గ్రామపంచాయతీ కింద పిచేర్యాగడి(ఎ), పిచేర్యాగడి(బి) తండాలు ఉండేవి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా మార్చే క్రమంలో రెండు తండాలను ఒకటిగా కలిపి పిచేర్యాగడి తండా(ఎ) గ్రామపంచాయతీగా మార్చారు. ప్రస్తుతం ఈ గ్రామపంచాయతీలో దాదాపు 1000 మంది వరకు గిరిజనులు నివసిస్తున్నారు. అయితే వారు తండా నుంచి మండల కేంద్రానికి రావాలన్నా, జహీరాబాద్ డివిజన్‌కు వెళ్లాలన్నా ఈ రోడ్డే పెద్ద దిక్కు. ఈ రోడ్డు పాడవడంతో తండావాసులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే నిత్యం ఏదో చోట పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డు పాడవడం వల్ల రవాణా సౌకర్యమే లేకుండా పోయింది. ఎలాంటి ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఈ తండాకు వచ్చే పరిస్థితి లేదు.

నిధులు మంజూరైనా ..

అధ్వానంగా మారిన తండా రోడ్డును బాగు చేయాలని గిరిజనులు కోరడంతో రెండేళ్ల క్రితం ఈ రోడ్డును బాగు చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.42 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయినప్పటికీ రోడ్డు పనులను మాత్రం ప్రారంభించ లేదు. ఇప్పటికైనా ఇప్పటికైనా అధికార యంత్రాంగం, కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును పునర్నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని యువకుడి దుర్మరణం



శ్రీకాంత్ మృత దేహం

రామాయంపేట, జూన్ 22: మండలం దామరచెర్వులో ఎక్స్‌కవేటర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కామారెడ్డి జిల్లా మల్లుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(23)శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా రామాయంపేట వైపు వస్తున్న ఎక్స్‌కవేటర్ బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మరణించాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ రంజిత్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎడ్లను కడిగేందుకు వెళ్లి వ్యక్తి మృతి

మునిపల్లి, జూన్ 22: ఏరువాక పండుగ సందర్భంగా ఎడ్లను కడిగేందుకు సింగూరు బ్యాక్ వాటర్‌లోకి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శనివారం మక్తక్యాసారం గ్రామంలో చోటుచేసున్నది. ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్తక్యాసారం గ్రామానికి చెందిన మద్దూరు కుమార్(23) అనే యువకుడు ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం గ్రామ సమీపంలోని సింగూరు బ్యాక్‌వాటర్ వద్దకు వెళ్లాడు. ఎడ్లను కడిగి బయటకు కొట్టే క్రమంలో ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు చెరువులోనే మునిగిపోయాడు. గజ ఈతగాళ్లు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త బలవన్మరణం

అల్లాదుర్గం, జూన్ 22 : భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని ముస్లాపూర్‌లో వెలుగుచూసింది. గ్రామస్థులు, స్థానిక ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముస్లాపూర్ గ్రామానికి చెందిన తూర్పాటి దుర్గయ్య(30) దంపతుల మధ్య 15 రోజుల క్రితం ఏర్పడిన విభేదాలతో భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం ఆమె కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన దుర్గయ్య తన రేకులషెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఈ షెడ్డు నుంచి దుర్వాసన రావడాన్ని కాలనీవాసులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. మృతుడి అన్న కుమారుడు సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గొల్లకుంట గిరిజన తండాలో వ్యక్తి..

అల్లాదుర్గం, జూన్ 22: మండలంలోని గొల్లకుంట గిరిజన తండాలో శనివారం రాత్రి ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లకుంట తండాకు చెందిన నేనావత్ చిన్నా(35) అనే వ్యక్తి సాయంత్రం నుంచి కనిపించలేదు. దీంతో అతడి నివాసంలో పరిశీలించగా ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

రైతుల రుణమాఫీపై హర్షం

మెదక్, జూన్ 22: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీపికబురు చెప్పిందని మెదక్ జిల్లా కిసాన్ సెల్ సంఘం అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కాకముందే బీఆర్ఎస్, బీజేపీలు ఆరు గ్యారంటీలు అమలు కాలేదని విమర్శించడం సిగ్గుచేటన్నారు. రైతు రుణామాఫీపై రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ అగ్ర నాయకులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు, పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మోల్సాబ్, కిషన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

- సంగారెడ్డి అర్బన్, జూన్ 22 : రుణ మాఫీ అమలు ప్రకటనపై రైతుల పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం రైతుల పక్షాన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి రైతు రక్షణ సమితి తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన జహీరాబాద్ ఎంపీ



స్పీకర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 22: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ శనివారం హైదరాబాద్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్‌పార్లమెంట్ నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలుపొందినందున సురేష్ షెట్కార్ మర్యాద పూర్వకంగా గడ్డంప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ సురేష్ షెట్కార్‌ను శాలువాతో సన్మానించారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మంత్రికి సమస్యలను వివరిస్తున్న నాయకులు

నర్సాపూర్, జూన్ 22: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండాసురేఖను నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు శనివారం కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు నియోజకవర్గంలోని నాయకులు హైదరాబాద్‌లో మంత్రి కొండాసురేఖను కలిసి నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

అధికారులతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమీక్ష



సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జూన్ 22: సంగారెడ్డి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రోడ్లు, పెండింగ్ పనులపై చర్చించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సంగారెడ్డి ఐబీ నుంచి బైపాస్ బసవేశ్వర విగ్రహం వరకు ఫోర్‌లైన్ రోడ్, రాజంపేట రోడ్డు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ దీపక్, ఐఆర్ఆర్ఐ డిప్యూటీ డీఈ బాలగణేష్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రవీందర్, శశాంక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ డబ్బాల దొంగల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

కౌడిపల్లి, జూన్ 22: గృహనిర్మాణ ప్రదేశాల్లో ఉండే సెంట్రింగ్ డబ్బాల చోరీలకు పాల్పడుతున్న 10మంది దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కౌడిపల్లిలో పోలీసులు ఏర్పాటు చేసిన సమావేశంలో మెదక్ ఎస్పీ బాల స్వామి వివరాలను వెల్లడించారు. ఈ మేరకు... ఈ నెల 11న మండలంలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన అల్మాయి పేట దశరథ్ తన ఇంటి నిర్మాణం కోసం సెంట్రింగ్ మేస్త్రి పెద్దపురం ఆశోక్ 200 సెంట్రింగ్ డబ్బాలను తీసుకురాగా అదే రోజు రాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేశారు. దీంతో మేస్త్రీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టి పోలీసులు కౌడిపల్లి ఎస్ఐ తో పాటు రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కౌడిపల్లి ఎస్ఐ సిబ్బందితో రాత్రి పూట తనిఖీలు నిర్వహిస్తుండగా తిరిగి సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం కోసం వచ్చిన దుండగులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.99 వేలు, ఒక ప్యాసింజర్ ఆటో, ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనం, 255 సెంట్రింగ్ డబ్బాలను రికవరీ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నారయనోళ్ల లింగప్ప(మహబూబ్ నగర్ జిల్లా), దండుగుల ప్రవీణ్ (అల్లాదుర్గం), మక్కాని నవీన్(శివ్వంపేట్), ద్యారంగుల అనిల్ (రంగంపేట్), సంపంగి విజయ్ (శివ్వంపేట్), మక్కని పవన్(శివ్వంపేట్) , వడ్డే శ్రీకాంత్(శివ్వంపేట్) సంగారెడ్డి జిల్లా , ద్యారంగుల యాదయ్య (రంగంపేట్), ద్యారంగుల దుర్గప్రసాద్ (రంగంపేట్), వాదిల దుర్గాప్రసాద్ (రంగంపేట్) ఉన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఉన్నారు. కేసు పురోగతిలో ప్రతిభ కనబరిచిన కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి, కానిస్టేబుల్ భాగయ్య, ఉపేందర్, శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నార్సింగిలో మృతదేహంతో బంధువుల ఆందోళన

చేగుంట జూన్ 22: రోడ్డు ప్రమాదంలో గాయపడి 20 రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన నర్సంపల్లి గ్రామానికిచెందిన అంజయ్య కుటుంబీకులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ నర్సంపల్లి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి మృతుడి బంధువులు రాస్తారోకో చేపట్టారు. సుమారు గంట సేపు ఆందోళన కొనసాగింది. మృతుడి కుటుంబీకులు న్యాయం చేస్తామంటూ నార్సింగి పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. రాస్తారోకోతో సుమారు గంటన్నరకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్‌సివిల్ జడ్జి, సూరిక్రిష్ణ

జహీరాబాద్, జూన్ 22: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అత్యవసరమని సీనియర్ సివిల్ జడ్జీ, మండల లీగల్‌సర్వీసెస్ ఛైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వెంకటేశ్వర పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, వివిధరకాల చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ- ప్రతి విద్యార్థికి చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహనను కలిగి ఉండాలన్నారు. అందులో బాగంగ నిషేదిత మాదకద్రవ్యాలతో జరిగే నష్టాలపై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలన్నారు. పోక్సోచట్టం, సమాచారహక్కుచట్టం, జువైనల్ జస్టిస్‌యాక్టు, ఉచితన్యాయసేవ సహాయం, తదితరాలపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాణెన్న, న్యాయవాదులు సోమశేఖర్, శంకర్, రుద్రయ్యస్వామి, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలు బూటకమే: దుబ్బాక ఎమ్మెల్యే



వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు

చేగుంట, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడుస్తున్నా ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేహారని, గతంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. గ్రామపంచాయతీ శానిటైజేషన్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. రైతు రుణమాఫీ, 24 గంటల విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రధాన రహదారులన్నీ దెబ్బతిని గుంతలమైనప్పటికీ పట్టించుకునే వారే లేరన్నారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడిచినా పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయడం లేదన్నారు. వర్షాలేక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండగా, ప్రభుత్వం సరైన విత్తనాలు సరఫరా చేయలేదని విమర్శించారు. నమ్మి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల తరఫున పోరాడుతామని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, జడ్పీటీసీ కృష్ణారెడ్డి మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఎమ్మెల్యే పూజలు

చేగుంట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నగేష్, బాలేష, నాగభూషణం, మాజి సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి

కల్హేర్, జూన్ 22: వ్యవసాయ పంట పొలాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో శనివారం జరిగింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన బి. బాల్‌రెడ్డికి చెందిన పాడి గేదె మరణించగా, మరో రెండు గేదెలు ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభాలు వంగి కిందికి వేలాడుతున్న తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో సిబ్బందికి, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతోనే ప్రమాదం సంభవించిందని గ్రామస్థులు మండిపడ్డారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

పటాన్‌చెరు, జులై 22: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. పటాన్‌చెరులోని శిశువిహార్ పాఠశాలలో ఉన్నత తరగతుల విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఎస్ఐ రాజేష్‌నాయక్, శిశువిహార్ ప్రిన్సిపాల్ బినాపిల్లయ్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కోసం మహిళల ఆందోళన

చిన్నశంకరంపేట, జూన్ 22: తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మహిళలు శనివారం ఆందోళన చేశారు. మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి తాగు నీటి సమస్య ఎదుర్కొంటున్నామని మహిళలు తెలిపారు. సర్పంచ్‌ల పదవీ కాలం అయిపోవడంతో స్పెషల్ ఆఫీసర్ గ్రామానికి ఇన్‌చార్జిగా ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాగడానికి నీరులేక అల్లాడుతున్న పట్టించుకునే అధికారులు కరువయ్యారని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

సదాశివపేట, జూన్ 22: అన్నిదానాల కన్న విద్యాదానం గొప్పదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని వెల్టూర్ గ్రామంలో మూడు పాఠశాలలకు దాత శ్రీ వేదాంతం సుబ్బారావు సహకారంతో నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. చదువులో ముందు ఉండడ మే కాకుండా ఆటల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ కృష్ణయ్య, ఏఏసీఎస్ ఛైర్మన్ రత్నాకర్ రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఛైర్మన్ ఉబేదుల్లా కోత్వా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సుధీర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన సేవా కేంద్రం

- జడ్పీ సీఈవో ఎల్లయ్య



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

అల్లాదుర్గం, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలన్న సంకల్పంతో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి సీహెచ్ ఎల్లయ్య స్పష్టం చేశారు. శనివారం అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాపాలన సేవాకేంద్రాన్ని గత రెండు నెలల పాటు నిర్వహించలేదని, కోడ్ ముగియడంతో తిరిగి ప్రజా పాలన సేవా కేంద్రాన్ని పునః ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ యాదవ్, జూనియర్ అసిస్టెంట్ సజ్జద్ అలీ, కంప్యూటర్ ఆపరేటర్లు లక్ష్మణ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

పలు మండలాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు



పెద్దశంకరంపేట: రామోజీపల్లిలో ఎడ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్న రైతులు



టేక్మాల్: గొల్లెగూడెంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు

టేక్మాల్, జూన్ 22: టేక్మాల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతులు పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం ఎద్దులను ముస్తాబు చేసి ర్యాలీగా డప్పు వాయిద్యాల మధ్య గ్రామాల్లో ఊరేగించారు. గొల్లగూడెంలో ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా శ్రీదుర్గమ్మ ముత్యాల, పోచమ్మ మత్తడి పోచమ్మకు బండ్లతోఊరేగింపు నిర్వహించారు.

- అల్లాదుర్గం: మండలంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ పరికరాలకు రైతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఎడ్లను రంగులతో అలంకరించి ఆలయాలకు ప్రదక్షిణలు చేశారు.
- పెద్దశంకరంపేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు తమ పశువులను వివిధ రంగులతో అలంకరించారు. పిండి వంటలను నైవేద్యంగా పెట్టి పశువులకు తినిపించారు. సాయంత్రం గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్లతో ప్రదక్షిణలు చేయించారు.

టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఫైజల్

సంగారెడ్డి రూరల్, జూన్ 22 : ఖమ్మంలో జరిగిన టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర మహాసభలో ఫైజల్‌ను యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఫైజల్‌ను యనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫైజల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, అమర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖలిక్ హుసేన్, మసూద్‌ఖాన్, ఆరీఫ్, శ్రీనివాస్, మురళి, శేఖ్, ఎండీ సిద్దిఖ్, మతిన్, పవన్, సంతోష్, అక్మల్, ఆరిఫ్, సాయి, ఆమెర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నర్సాపూర్, జూన్ 22: కేంద్ర మంత్రిగా మరోసారి బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డిని శనివారం నర్సాపూర్‌కు చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రమేష్‌గౌడ్‌తో పాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు.



కేంద్ర మంత్రిని కలిసిన రమేష్‌గౌడ్ తదితరులు

ఆర్టీసీ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

సంగారెడ్డి అర్బన్, జూన్ 22: ఆర్టీసీ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సంగారెడ్డి డిపో ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మెదక్ డిపోలో జరుగుతున్న డ్రైవర్ల ఆందోళనలో భాగంగా శనివారం కూడా విధులు బహిష్కరించినట్టు తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని లేకపోతే మెదక్ రీజియన్ వ్యాప్తంగా కండక్టర్లు, మెకానిక్, తోటి సూపర్‌వైజర్లందరిని కలుపుకొని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మెదక్ రీజియన్‌లోని అన్ని డిపోలలో వారికి సంఘీభావంగా బంద్ పాటిస్తామని తెలిపారు.